క్లుప్తంగా

ఉచిత ఫిజియోథెరపీ క్యాంపు



ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యులు

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ ఉచిత వైద్య క్యాంపును నిర్వహించారు. సుమారు 40మంది రోగులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు ఆకుల అజయ్‌కుమార్, వైద్యులు కుమారస్వామి, దివ్యారాణి, నీలం సురేందర్, శ్యాంసుందర్, అనిల్, దుర్గాప్రసాద్, తేజస్విని, అనూష పాల్గొన్నారు.

హోర్డింగులు తొలగించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన హోర్డింగులను వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి న్యాయవాది మాదిరి రాకేశ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో అనుమతి లేకుండా విచ్చలవిడిగా హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూముల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి శివారులో గల సర్వే నంబర్ 444లో రంగపల్లె సమీపంలోని సీఏ ప్రతిపాదిత ల్యాండ్‌తో పాటు కొంత ప్రభుత్వ భూమిని ఒకరిద్దరు నాయకులు కబ్జా ప్రయత్నంలో భాగంగా భూమిని చదును చేశారు. దీనిపై ఈ నెల 4న 'సాక్షి' దినపత్రికలో 'అటవీ భూమి కబ్జా' అనే శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. స్పందించిన అధికారులు చదును చేసిన భూమిని పరిశీలించి సర్వే చేశారు. కాగా సోమవారం ఆ భూమిలో 'ఇది ప్రభుత్వ భూమి.. ఆక్రమించిన వారు శిక్షార్హులు' అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా భూమిని చదును చేసింది ఎవరు అనే దానిపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

రోడ్డుపై బైఠాయించి నిరసన



నిరసన తెలుపుతున్న రమేశ్

కాసిపేట: మండలంలోని కొండాపూర్ యాప చౌరస్తాలో రోడ్డు అధ్వానంగా మారింది. ప్రజలు రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ప్రమాదాలు జరిగాయి, వాహనాలు చెడిపోతున్నాయి. ఏది ధరించకపోయిన ఫైన్‌లు విధించే అధికారులు రోడ్డు ఇలా ఉంటే పట్టించుకోరా అని మాదిగ హక్కుల దండోరా సంఘం మండలాధ్యక్షుడు అటకపురం రమేశ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజల ఇబ్బందులు పట్టించుకోకపోతే ఫైన్ ఎలా కడతామని మండిపడ్డారు. ఫ్లకార్డు ప్రదర్శించి సోమవారం నిరసన తెలిపారు.

మేళాకు స్పందన



మేళాకు హాజరైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళాకు స్పందన లభించింది. 901ఖాళీలుండగా 186మంది హాజరయ్యారు. ఇందులో ఆయా కంపెనీలో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్ కోపా, వెల్డర్, డ్రాఫ్టుమన్ ట్రేడ్స్‌లో 138మందిని ఎంపిక చేశారు. ఆయా కంపెనీల ప్రతినిధులు ఆర్కే నాయుడు, తరుణ్, శివసాయి, రాహుల్, వేణు, శ్రీనివాస్, ఐటీఐ మండమర్రి ట్రేనింగ్ ఆఫీసర్ సునీల్, సూపరింటెండెంట్ సతీశ్, డీటీవో మంచిర్యాల ముస్వర్‌పాషా ఏటీవో సోహిబ్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి వారోత్సవాలు

పాతమంచిర్యాల: ఈ నెల 10 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటాల విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కనికరపు అశోక్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, నాయకులు పి.రాములు, చందర్ పాల్గొన్నారు.

వానర మూకల హల్‌చల్

- ఠాగూర్ స్టేడియంలో కోతుల గుంపు తిష్ట
- రామకృష్ణాపూర్‌లోని పలు ప్రాంతాల్లో సంచారం
- దాడులపై భయాందోళన చెందుతున్న ప్రజలు
- కట్టడికి చర్యలు తీసుకోవాలని వేడుకోలు



సింగరేణి స్టేడియంలో గుంపులుగా కోతులు

రామకృష్ణాపూర్: పట్టణ వ్యాప్తంగా వానరాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. స్థానిక ఠాగూర్ స్టేడియాన్ని వాటి స్థావరంగా మలుచుకొని, అటుగా వెళ్తున్న, వెళ్లే వారిని భయాందోళనలకు గురిచేస్తున్నాయి. దీంతో వాకింగ్, వ్యాయామం కోసమని స్టేడియానికి వచ్చే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ వైపు నుంచి వచ్చి కరుస్తాయో అని కలవరపడుతున్నారు. రోజురోజుకు శృతిమించుతున్న ఈ కోతుల పని పట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఈ మధ్యకాలంలోనైతే మరీ విస్తృతమైంది. ముఖ్యంగా స్థానిక సివిల్ డిపార్ట్‌మెంట్, ఠాగూర్ స్టేడియం ప్రాంతాల్లో కోతుల బెడద విపరీతంగా పెరిగింది. కోతుల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోతుండటం సంకటంగా మారింది. వందల సంఖ్యలో అవి తచ్చాడుతుండటంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. సింగరేణి క్వార్టర్లు ఉన్న సీ–2, షిర్కే క్వార్టర్లలోనూ పరిస్థితి ఇలాగే ఉంది.

పూర్తిగా అరికడితేనే మేలు...

కోతుల బెడద తీరాలంటే వాటిని పూర్తిగా అరికట్టడమే మేలని పట్టణ ప్రజలు అంటున్నారు. గతంలో కోతులను పట్టేందుకు చర్యలు తీసుకొని, ఆ తర్వాత ఎందుకు ఉపసంహరించారో అంతుపట్టడంలేదని వాపోతున్నారు. ఏదేమైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఈ కోతుల సమస్య పూర్తిగా నివారించేలా చూడాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా అధికారులు కోతులు పట్టే వారిని వెనువెంటనే రప్పిస్తే బాగుంటుందని ప్రజలు కోరతున్నారు.

కోతుల పట్టడం నిలిపివేయడంతోనే...

కోతుల బెడద ఎక్కువ ఉందనే గతంలో వాటిని పట్టే ప్రక్రియ చేపట్టారు మున్సిపల్ అధికారులు. ఇందుకోసం కోతులు పట్టే వారిని రప్పించారు. కొన్ని రోజుల పాటు చేపట్టిన చర్యలు ఎందుకోగాని నిలిపివేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. గతం కంటే ఇప్పుడు మరీ కోతుల సంచారం అధికమైంది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి కోతుల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నగదు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థులకు హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రెడ్‌మిషన్ క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు చెక్కును సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కుమార్‌దీపక్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా కార్మెల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి గెలుపొందడం జిల్లాకు గర్వకారణం అన్నారు. విద్యార్థులకు నగదు రూ.8వేలు, ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధాకర్‌నాయక్, డీఈఎంవో వెంకటేశ్వర్లు, దిశా సీపీఎం నీలిమ, కార్మెల్ స్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు హోలీ బాహ్, ప్రిన్సిపాల్ సిస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశం

చెన్నూర్: జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి ప్రతీ పోలీసు అధికారి కృషి చేయాలని స్థానిక జడ్జి పర్వతపు రవి అన్నారు. జూనియర్ సివిల్ కోర్టులో చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి, భీమారం, జైపూర్ పోలీసుస్టేషన్ల ఎస్సైలు, కోర్టు పోలీసులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 13న కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్‌స్టేషన్ల వారీగా ఉన్న పెండింగ్ కేసుల పరిష్కార మార్గానికి కక్షిదారులతో మాట్లాడి, తీసుకొని రావాలన్నారు. సమావేశంలో కోర్టు పరిధిలోని ఎస్సైలు, లైజన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కోతులు, పందులతో పంటలు నాశనం

- పత్తిని కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
- గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమవుతున్న సమస్య

జన్నారం: పత్తి పంట కాయలు వచ్చే సమయంలో రైతుకు కష్టం వచ్చి పడుతుంది. ఓ వైపు పందులు, మరో వైపు కోతులు కునుకు లేకుండా చేస్తున్నాయి. పొద్దంతా కోతుల నుంచి, రాత్రి పందుల నుంచి పత్తి పంటను కాపాడుకోవడం కోసం తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జన్నారం మండలం కలమడుగు, మురిమడుగు, ఇందన్‌పల్లి, ధర్మారం గ్రామాల్లో ఈ సమస్య రోజురోజుకు పెరుగుతుంది. పంటను కాపాడుకోవడం కోసం రైతులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. పత్తి కాయలను కోతులు కొరికి పాడు చేస్తున్నాయని, పందులు వచ్చి పత్తి పంటను నాశనం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. కొందరు రైతులు చేను చుట్టూ చీరలు కడుతూ, కంచె ఏర్పాటు చేస్తున్నారు. మరి కొందరు సోలార్ తీగలు పెడుతున్నారు. మురిమడుగులో ఓ రైతు తక్కువ ఖర్చుతో నైలాన్ తాడుతో కంచె ఏర్పాటు చేసి, చేను చుట్టూ కట్టి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. రైతుకు వస్తున్న ఇబ్బందిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, రైతులకు సహకరించాలని కోరుతున్నారు.



పంటచుట్టూ ఏర్పాటు చేసిన నైలాన్ దారం కంచె

నైలాన్ దారంతో కంచె...



నా కున్న ఎకరం భూమిలో పత్తి పంట వేసుకున్నా. పంట చేతికొచ్చే సమయంలో పందులు, కోతుల బెడద పెరిగింది. ఇప్పటికే పందులు రెండుసార్లు నా చేనులో పడి, పంటను నాశనం చేశాయి. పంటను కాపాడుకోవడానికి రూ.10వేల ఖర్చుతో నైలాన్ తాడుతో కంచె ఏర్పాటు చేసి పంటను కాపాడుకుంటున్నా. – కచ్చె రాజన్న

బొగ్గుబాయి వార్తలు

40శాతం లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: కంపెనీ గడిచిన ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల నుంచి కార్మికులకు 40శాతం చెల్లించాలని టీఎన్‌టీయూసీ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కంపెనీ గడిచిన సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో, రవాణాల్లో రికార్డు సాధించిందన్నారు. కార్మికులు ఎంతో కష్టపడి పని చేస్తేనే ఇది సాధ్యమైందన్నారు. కంపెనీ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పెద్దపెల్లి నియోజకవర్గం మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, పట్టణ అధ్యక్షుడు గరిగంటి రాజయ్య, నాయకులు తిరుపతి, సులేమాన్, సుధాకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక (2024–25) సంవత్సరం వచ్చిన లాభాల్లో 40శాతం వాటా వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్మినెంట్ కార్మికులతో బొగ్గు ఉత్పత్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు శ్రీనివాసరాజు, దొనికెల రమేశ్, ప్రదీప్‌కుమార్, రజనీకాంత్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

రక్షణలో ఓసీపీ ఆదర్శం

- జీఎం శ్రీనివాస్



ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: రక్షణలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని ఇతర ఓసీపీలకు ఆదర్శంగా నిలిచిందని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల బహుమతి ప్రదానోత్సవంలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనికి మూడు బహుమతులు లభించాయి. గ్రూప్–1 గనుల విభాగంలో ఫస్ట్ ఎయిడ్‌లో మొదటి బహుమతి, ఎన్విరాన్మెంట్ ద్వితీయ బహుమతి, ఓవరాల్‌గా ద్వితీయ బహుమతి సాధించింది. గని ఆవరణలోని మైసమ్మ ఆలయం నుంచి సైట్ ఆఫీస్ వరకు సోమవారం బహుమతులతో ఉద్యోగులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదికపై జరిగిన కార్యక్రమంలో జీఎం ఉద్యోగులను, అధికారులను అభినందిస్తూ మాట్లాడారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఇతర గనులు ఓసీపీని ఆదర్శంగా తీసుకొని రక్షణలో ప్రమాణాలు పాటించాలన్నారు. రక్షణతో పని చేస్తూ బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు, గని మేనేజర్ శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సహాయ కార్యదర్శి కొమురయ్య, ఇంజనీర్ నాగరాజు, రక్షణ అధికారి శ్రీధర్ రావు, గుర్తింపు సంఘం నాయకులు చంద్రమోహన్, ఫిట్ సెక్రటరీ లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బండి రమేశ్

శ్రీరాంపూర్: ఎస్ఆర్పీ 3–గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ డిమాండ్ చేశారు. గనిని సందర్శించి సోమవారం ఆయన కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాలర్ ఆపరేటర్లకు, లైన్‌మెన్లకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువయ్యాయన్నారు. డ్రిల్ బిట్లు, రాడ్ల కొరత ఉందని, అవి కూడా నాణ్యమైనవి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలకు సమీపంలోనే ఎయిర్ కంప్రెషనర్లను, రూఫ్‌బోల్టర్లను సమకూర్చాలన్నారు. మైనింగ్ స్టాఫ్ కొరత తీవ్రంగా ఉందని, వారి సంఖ్య పెంచాలన్నారు. అనంతరం గని మేనేజర్ వెంకటేశ్వర్లను ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు లక్ష్మణ్, పొగాకు రమేశ్, అన్వేశ్ రెడ్డి, ఏరియా నాయకులు సాధుల భాస్కర్, ఉత్తేజ్‌రెడ్డి, బుస్సా రమేశ్, రాజు నాయక్, ఫిట్ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, తొటం నరేశ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్పత్తి, రక్షణలో సూపర్‌వైజర్లే కీలకం

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణలో సూపర్‌వైజర్లే కీలకమని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఆర్పీ 3, 3ఏ గనిపై సోమవారం సూపర్‌వైజర్లకు, అధికారులకు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గనికి నిర్దేశించిన 3.4లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని ఖచ్చితంగా సాధించాలన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణ, ఉత్పాదకతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ వెంకట్రావు, రక్షణ అధికారి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి కోర్సులకు రేపు రాత పరీక్ష

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వృత్తి శిక్షణ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం రాత పరీక్ష నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద నేర్చుకున్న వారికి ఇక్కడి సేవా భవన్‌లో, శ్రీరాంపూర్ కాలనీలో సేవా భవన్ వద్ద నేర్చుకున్న వారికి ప్రగతి మైదానంలో సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 11గంటలకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాదీ గ్రామోద్యోగ్ వారు ఈ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. కావున శిక్షణ పొందిన మహిళలు పరీక్షకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు సులభ్ కార్మికుల ఫిర్యాదు

శ్రీరాంపూర్: సింగరేణిలోని సులభ్ కాంప్లెక్స్‌లలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించేలా యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సులభ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఇన్‌చార్జి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో సోమవారం ఈ ఫిర్యాదు సమర్పించారు. ఆ యూనియన్ నాయకులు సంజీవ్ పాల్గొన్నారు.

వార్షిక లక్ష్య సాధనకు కృషి చేయాలి

జైపూర్: భూగర్భ గనులను కాపాడుకోవడానికి ప్రతీ ఉద్యోగి, అధికారి కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. 2025–2026 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు తోడ్పాటు అందించాలని కోరారు. ఇందారం ఐకే1ఏ గనిపై సోమవారం బొగ్గు ఉత్పాదకత పెంపుదల కోసం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది ఐకే1–ఏ గని 2.4లక్షల వార్షిక లక్ష్యంగా పెట్టుకున్నట్లు, టార్గెట్ సాధించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐకే–ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్లు నాగన్న, కోటయ్య, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, ఫిట్ ఇంజనీర్ మల్లేశ్, రక్షణాధికారి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ



శిక్షణకు హాజరైన కానిస్టేబుళ్లతో కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో సోమవారం ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. 51వ తెలంగాణ ఆర్టీసీ కానిస్టేబుళ్ల రిఫ్రెషర్ కోర్సును బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు ఆధ్వర్యంలో ప్రారంభం కాగా అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కానిస్టేబుళ్లు కూడా ప్రతిరోజు డ్రిల్ చేస్తూ క్రమశిక్షణతో ఉద్యోగం చేస్తూ సంస్థకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. 13మంది మహిళా, 30మంది పురుషులతో మొత్తం 43మంది కానిస్టేబుళ్లు శిక్షణ పొందుతున్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు కాళిదాసు, బాలయ్య, రవీందర్, ఆర్‌ఐలు భాస్కర్, సతీశ్, అన్నయ్య, అశోక్, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యేపై అనుచితంగా ప్రవర్తించడం సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుపై కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ అనుచితంగా ప్రవర్తించడం సరికాదని, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్ మాట్లాడారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ నిమజ్జనం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతుండగా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేశ్ మైక్ లాక్కోవడం సరికాదన్నారు. తప్పు కాంగ్రెస్ పార్టీ వారే చేసి, తప్పు చేయని వారిపై అధికారం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బేర సత్యనారాయణ, అత్తి సరోజ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్, సందెల వెంకటేశ్, ఎర్రం తిరుపతి, తోట తిరుపతి, పడాల రవీందర్, గోగుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

పాతమంచిర్యాల/దండేపల్లి/భీమిని/తాండూర్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. తాండూర్, భీమిని, దండేపల్లి మండలాల్లో పలు పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో ఎంఈవో మాలతి దేవి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పద్మజ, కల్పన, కృష్ణ, సత్యేంద్రకుమార్‌లను లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ సభ్యులు సన్మానించారు. జిల్లా కేంద్రంలోని(సినిమావాడ) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దండేపల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శ్రీనివాస్, తులసీపతి, శివప్రసాద్, వసంత, మంజుల, సుజాతలను ఎంఈవో చిన్నయ్య, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు చిన్న నరసయ్య, సుదర్శన్, రాజేశ్వరరావు, ఎంఆర్సీ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం చైర్‌పర్సన్ వేణుగోపాల్, కోశాధికారి రామస్వామి, రీజియన్ చైర్‌పర్సన్ కొత్త సురేందర్, సీనియర్ సభ్యులు మధుసూధన్ రెడ్డి, వినయ్‌కుమార్, సిరిపురం శ్రీనివాస్, గోలి రాము, తాండూర్‌లో ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు రమేశ్, మురళి, సీఆర్పీలు నాగరాజు, తిరుపతి, కన్నెపల్లి, భీమిని ఎంఈవోలు రాము, కృష్ణమూర్తి, దండేపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం

మంచిర్యాలఅర్బన్: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేసి రాష్ట్రంలో నాల్గో స్థానంలో నిలిచిన మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. వంద శాతం సాధించటంలో సహకరించిన సిబ్బంది శ్రీధర్‌రాజు, టి.వెంకటేశ్వర్లు, ఎంఏ హఫీజ్‌లు కూడా ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కరించాలని 'ప్రజావాణి'లో వినతి

కోటపల్లి: రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని సోమవారం ప్రజావాణిలో బీజేపీ మండల అధ్యక్షురాలు పెద్దింటి స్వప్న తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పున్నంచంద్, నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించగా 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు.

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ పెద్దనపల్లి, నాయకపుగూడెం గ్రామ ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని సోమవారం గ్రీవెన్స్‌లో యువజన కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ చెండే నవీన్ అధికారులకు విన్నవించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

తాండూర్: మండల పరిధిలోని గ్రామాల్లో పందులు, కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, పారిశుద్ధ్య సమస్య తీర్చాలని, వీధి దీపాలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, మంచినీటి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పులుగం తిరుపతి, చిలువేరు శేషగిరి, నాయకులు సిద్ధం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా చెట్ల నరికివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సింగాపూర్‌లో రహదారి పక్కన పెద్ద చెట్ల కొమ్మలను సోమవారం కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశా రు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి చ ర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

108 సేవలను వినియోగించుకోవాలి

జన్నారం: 108సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో 108ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ కండీషన్, మందుల వివరాలు, రిజిస్టర్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఎంటీలు కిషన్, రమేశ్, పైలట్‌లు రఫీక్, గంగాధర్ ఉన్నారు.

గ్రంథాలయంలో బోర్‌వెల్ ఏర్పాటు చేయాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ శాఖ గ్రంథాలయం ఆవరణంలో అవసరాల కోసం వెంటనే బోర్‌వెల్‌ను ఏర్పాటు చేయాలని పాఠకులు, పలువురు యువకులు కోరారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రవీణ్, మురళీ, ఆసిఫ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్కివెంకటాపూర్‌లో కొనసాగించాలని వినతి

దండేపల్లి: మండలంలోని వందుర్‌గూడను నెల్కివెంకటాపూర్ జీపీలో కొనసాగించాలని వందుర్‌గూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. దండేపల్లిలో ఎంపీవో, ఎంపీడీవో, తహసీల్దార్, మంచిర్యాలలో జిల్లా పంచాయతీ అధికా రితో పాటు, కలెక్టర్‌కు సోమవారం వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు. పంచాయతీ ఏర్పాటు విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు టేకం భీంరావు, కోవ తిరుపతి, మారుతి, సిడాం కొమురయ్య, కుంరం బాపురావు, సోనే రావు, కుడ్మేత వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

వేమనపల్లి: మండల తహసీల్దార్‌గా సోమవారం పుష్పలత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సంధ్యారాణి నిర్మల్‌కు బదిలీపై వెళ్లారు. ఆసిఫాబాద్ నుంచి వచ్చిన పుష్పలత బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది పూల బుకేలు ఇచ్చి స్వాగతం పలికారు.